# విలువలు

"ఈ ఆడవాళ్ళతో ప్రయాణం చేయడం కంటే బుద్ధి తక్కువ పని మరొకటి లేదు" అంటూ విసుగుతో సన్నగా గొణిగేరు మా వారు. ఆయన విసుగ్గానూ, కోపంగానూ ఉన్నప్పుడే నేను బహువచనంగా అనిపిస్తానని మా వారి మీద నా పరిశోధన.

ఆయనకి కోపం వచ్చినప్పుడు సింహంలా, విసుగొచ్చినప్పుడు చిరుతపులిలా, బాధలూ, దిగుళ్ళూ పడేటప్పుడు గంగిగోవులా ఉంటారు. ప్రస్తుతం సింహం, చిరుత పులీ ఆయన మొహంలో పోటీ పడుతున్నాయి తొంగి చూడటానికి.

మరాయనకి అంత కోపం రావడానికి నేను సగం కారణమైతే, తక్కిన సగం కారణం మేము వెళ్ళాలనుకున్న సిటీ బస్సు ఐదు నిమిషాల క్రితం వెళ్ళిపోవటం.

"నీకెన్నిసార్లు చెప్పినా సరయిన టైమ్‌కి తెమలవు. తెల్లారి నాలుగ్గంటలకే లేపానా? రెడీ కావడానికి.. అప్పట్నించి ఏం చేసేవు? నా పనులన్నీ చూసుకుని సూట్‌కేసులో బట్టలు సర్దిపెట్టేను - ఐదు ముప్పావుకి కానీ నీ జడ వేసుకోడం, కాటుక దిద్దుకోడం అవలేదు.. నీ కింకా ఎన్నేళ్ళు పడుతుందో టైమ్ విలువ తెలీడానికి.."

ఆయన సహజ ధోరణి అది, నేనేం చేయనూ! ఆయన ఏ ఊరికయినా పొద్దునే బయల్దేరాలనుకున్నారా.. రాత్రే అలారం పీస్‌కి "కీ" ఇచ్చి ఉంచుతారు. అదెక్కడ మోగకుండా పోతోందోనని తెల్లారే లోపుల ఓ డజను సార్లు లేచి "ఏంటిది ఆడుతోందా అసలు?" అంటూ అనుమానంగా చూస్తూ ఉంటారు. చివరికది అలారం మోగే టప్పటికి ఆయన ప్రయాణ సన్నాహాలన్నీ ఒక్కటీ మిగలకుండా పూర్తయి పోయి ఉంటాయి... అదాయన ఖర్మ! అందరూ అలాగే 'ఖర్మ'తో బతకాలని ఆయన హౌస్ అడ్మినిస్ట్రేషన్‌లో మొదటి అన్ రిటన్ రూలు!

"బళ్ళార్లో మనకి ఏడున్నర బస్సు దొరుకుతుందా? ఇంకేం దొరుకుతుంది.. మనం పదిన్నరకి అనంతపురం చేరలేం.. ఆ ఈశ్వర్రావు గాడు - పెళ్ళికి ఆలస్యంగా వెళ్ళినందుకు -- ఏకంగా

బారసాల నాడు రాలేకపోయేవా ? అని వెదవ జోకులు వేసి తీరుతాడు... అది మాత్రం ఖాయం..."

ఎవరయినా మా యిద్దర్నీ అలవోగ్గా చూస్తే మటుకు ఆయన నాకేదో చెబుతున్నారని అనుకుంటారు. కానీ ఆయనకి పాత నాటకాలు చూసే అలవాటేమో, అందుకే స్వగతంలా చెప్పుకు పోతుంటారు. దాన్నే నా పరిభాషలో "గొణుగుడు" అంటాను.

ఆయన గొణుగుడు వినకుండా అలా ఓసారి చుట్టూ కలయ జూసేను, సంగనకల్లు పల్లెటూరే అయినా నగరానికి అతి సమీపంలో వుండటం వల్ల సిటీ బస్సులూ, ఆటో రిక్షాలూ, రిక్షాలూ తిరుగుతూ ఉంటాయి. సిటీ బస్సులు తిరుగుతాయి కాబట్టి చిన్న బస్టాపుంది. దాంట్లో ప్రయాణీకులు లేరు గానీ ఓ గేదె దాని ముద్దు పట్టి కాపరం చేస్తున్నాయి. రోడ్డు కిరువైపులా రెండు చిల్లర కొట్టులూ, రెండు కిళ్ళీ కొట్టులూ, నాలుగు టీ స్టాల్లూ ఉన్నాయి. అల్లంత దూరంలో ఓ ప్రభుత్వ సారా దుకాణం కూడా ఉంది.

"ఏమండీ ఆటో కావాలా?" అనడిగేడు ఓ ఆటో డ్రైవర్.

వెళ్దాం పదండీ! అందామనుకున్నాను.

"ఎంత?" మా వారు అడిగేరు.

"ఒకరికి నాలుగు రూపాయలు"

"ఇద్దరికీ ఎనిమిది? అఖర్లేదు - వెళ్ళు" అన్నారు మా వారు.

ఈయన అలా అనగానే అక్కడున్న ఇద్దరు పల్లెటూరి వాళ్ళు అందులో వెళ్ళిపోయేరు.

"ఈ ఆటో వాళ్ళంత దోపిడీ మరెవరూ చేయరు. ఒకరికి నాలుగు రూపాయలట" అంటూ ఓ స్టేట్‌మెంట్‌ని గాల్లోకి వదిలేసి సిగరేట్ వెలిగించేరు మా ఆయన.

బళ్ళారిలో అనంతపురం వెళ్ళే యమ్.జి బస్సు ఎక్కాలంటే ఆటో రిక్షాకో, రిక్షాకో వెళ్ళాల్సిందే, 7 గంటల వరకు మరో సిటీ బస్ లేదు.

"రిక్షా ఏదయినా వస్తుందేమో వెళ్దాంలే!" అన్నారు మా వారు.

రిక్షా వాడికి నూరేళ్ళ ఆయుష్షు ఉన్నట్టుంది. లేకపోతే అనుకున్నదే తడవుగా కనబడ్డం ఏమిటి? అతను సరాసరి మా దగ్గరకే వచ్చేడు.

"వస్తావా బళ్ళారి బస్టాండ్‌కి... ఏమివ్వాలి?"

"నాలుగు రూపాయలియ్యండయ్యా!"

"అబ్బే కుదర్దు మూడు రూపాయలిస్తా"

"కుదరదయ్యా! బళ్ళారి చూసే దానికి దగ్గరగా కనబడతాది. కానీ, శానా దవ్వుండాది సామీ!"

అతడన్నది నిజమే - నాలుగు కిలోమీటర్లు వుంది మేమున్న చోటికి. అందుకేనేమో మా వారు మారు మాటాడకుండా 'సరే ఎక్కు' అని నన్ను ఆజ్ఞాపించేసి రిక్షాలో కూచున్నారు. నేనూ కూచున్నాను.

రిక్షా కదిలింది.

మెల్లగా ఊరి పొలిమేలు దాటుతోంది... చుట్టూ పచ్చటి పత్తి పొలాలు. ఒకటో రెండో లారీలు ఎదురొస్తున్నాయి.

అతను మరీ జబ్బు మనిషిలా ఉన్నాడు. రిక్షాను చాలా మెల్లగా తొక్కుతున్నాడు.

"సిటీ బస్సుకైతే రెండు రూపాయలకే ఇద్దరం బళ్ళారి చేరేవాళ్ళం. ఇప్పుడు చూడు నాలుగు రూపాయలు..." అన్నారు మా వారు.

"ఆ ఆటో వాడి కన్నా నయం కదా!" అన్నాను. కొంచెం గొంతు తగ్గించాను. రిక్షా వాడి చెవి సోకకుండా.

"అవుననుకో... ఒక్క అయిదు నిముషాలు ముందుగా వచ్చుంటే రెండ్రూపాయలు మిగిలేవి.."

నేను మౌనంగా ఉండిపోయేను. టైమ్ విలువ, డబ్బు విలువ మీద విడివిడిగా రెండు లెక్చర్లు ఇస్తారేమోనని భయం.

"కేవలం రెండు రూపాయలకే ఈ పాటికెప్పుడో బస్టాండు చేరేవాళ్ళం. ఏ హోటల్‌లోనో టిఫిన్ చేసేసి హాయిగా బస్ కోసం ఎదురు చూస్తూ ఉండేవాళ్ళం.. ఇప్పుడు చూడు, వీడెంత నిదానంగా తొక్కుతున్నాడో మరో గంటకయినా చేరుస్తాడా బళ్ళారి.. అప్పుడే ఆరుంపావు అయింది... తొందరగా తొక్కవయ్యా ఇంత నిదానమైతే ఎలా" అంటూ రిక్షావాడి మీద కేకలేశారు.

శక్తినంతా కూడదీసుకుని తొక్కుతున్నాడు అతను.

"దొరికి దొరికి రిక్షానే దొరకాలా?" అంటూ తల పట్టుకున్నారు ఆయన.

"చాల్లేండి అతను వింటే ఏమనుకోడూ! బాగానే తొక్కుతున్నాడుగా" అన్నాను గుసగుసల్తోటి.

"విననీ.. వీడి తీరు చూస్తోంటే కాసేపుట్లో సొమ్మసిల్లి పడిపోయేట్టున్నాడు... పోనీ నేను తొక్కనా?"

ఆయన చచ్చు జోకులు ఎక్కడ వింటాడోనని "మీది ఈ ఊరేనా బాబూ!" అన్నాను రిక్షావాడి నుద్దేశించి.

"కాదు తల్లీ! మాది రాయదుర్గం అవతల భైరవాని తిప్ప వానల్లేక ఉన్న ఎకరా నేల బీడు పడిపోయె.. ఏం చేసేది.. అందుకే ఊరు విడిచి ఈడికొచ్చి రిక్షా తొక్కుతా ఉండాను" అన్నాడు రిక్షావాడు.

అందుకే - అతను నాలుగు రూపాయలకే రిక్షా తొక్కుతున్నాడని అర్థమైంది.

ఏమయితేనేం బళ్ళారి బస్టాండు లోకి చేర్చేడు రిక్షావాడు.

అప్పటికే మేం వెళ్ళాల్సిన బస్సు సిద్ధంగా వుంది. నేను సూట్‌కేసు తీసుకొని బస్‌లోకెళ్ళి కూచున్నాను. రిక్షా వాడికి డబ్బులివ్వడానికి గాను అక్కడి ఉండిపోయేరు మా వారు.

కండక్టరు రావటం, నేను టికెట్లు తీసుకోవటం అన్నీ జరిగినా అప్పటికీ మా వారు రాలేదు. రిక్షా వాడికి డబ్బు లివ్వడంలో అంత ఆలస్యం ఎందుకు జరుగుతోందో! 'రిక్షా ఎప్పుడు - ఎలా తొక్కాలి' అన్న టాపిక్ మీద లెక్చర్ ఇవ్వటం లేదు కదా?

బస్ స్టార్టయింది. కాని కదలల్లేదు.

సరిగ్గా అప్పుడు ఆత్రంగాత్రంగా ఆయన బస్సెక్కేసేరు. చేతిలో తెలుగు డైలీ పేపరుతో నవ్వుతూ వచ్చి కూర్చున్నారు.

"ఎందుకు ఆలస్యమైందీ?" అడిగేను.

"రిక్షా వాడికి నాలుగు రూపాయల చిల్లర ఇవ్వటానికింత ఆలస్యమైందిలే.. ఐదు రూపాయల నోటిస్తే ఒక్క రూపాయి తిరిగి యివ్వడానికి తన దగ్గర ఏమీ లేదంటాడు వెధవ! ఐదు రూపాయలూ ఇస్తాడులే అని ఆశేమో!"

"పాపం! అంతదూరం నుంచి నాలుగు రూపాయలకే వచ్చాడు కదండీ - ఆ ఒక్క రూపాయి ఇచ్చుంటే ఏం పోయేది." అన్నాను.

నా వేపు వింతగా చూసి - "నీకు మతిపోయిందా? మనకు సిటీ బస్సే దొరికుంటే రెండు రూపాయలకే వచ్చేవాళ్ళం. ఇప్పుడు మనకి రెండు రూపాయలు లాస్ అయినట్టే లెక్క. అందుకే అయిదు రూపాయలు చస్తే యివ్వకూడదని ఈ డైలీ పేపరు కొన్నా..."

"బస్సూ, రిక్షా ఒకటెలా అవుతాయండీ! అది యంత్రం, ఇది రిక్షా వాడి శ్రమ!"

"అవన్నీ ఎవడిక్కావాలి! డబ్బు ఎంత నష్టపోతున్నామో అన్నది ముఖ్యం కానీ!.. నీకు బుద్ధుందా అసలు - రెండు రూపాయలు నష్టపెట్టింది కాక మరో రూపాయి నష్టపోలేదేమా అని నాతో వాదం!!! చాల్లే ఇంక నోర్మూయ్!!"

ఆయనలా మాటాడుతోంటే - మనిషి శ్రమ ముందు యంత్ర భూతం వికటాట్టహాసం చేసినట్టు అనిపిస్తోంది నాకు.

నెమ్మదిగా కదుల్తోన్న బస్సు కిటికీలోంచి కనబడ్డాడు రిక్షావాడు.

ఎంత దూరానికి, ఎంత డబ్బు చార్జి చేయాలో తెలీని అతను. మరెవరికో మోసపోవడానికేమో అప్పుడే వచ్చిన బస్సు వంక ఆశగా చూస్తున్నాడు. మేం కూచున్న బస్సు మెల్లగా కదుల్తోంది.

- ఆంధ్రజ్యోతి, ఆదివారం అనుబంధం (16-5-91)